## క్లుప్తంగా

### నేడు చెరుకూరులో రైతుల సమావేశం

**పర్చూరు (కారంచేడు):** నల్లమడ రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో చెరుకూరులో గురువారం సమావేశం నిర్వహించనున్నట్లు రైతు సంఘం నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. నల్లమడ వాగు అభివృద్ధితో పాటు, గుంటూరు చానల్ పర్చూరు వరకు పొడిగించడం, నల్లమడ రైతులపై ఉన్న అక్రమ కేసుల ఎత్తివేత వంటి పలు అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు నల్లమడ రైతు సోదరులంతా తప్పకుండా హాజరు కావాలని కోరారు.

### నిబంధనలు తప్పనిసరి


పర్యాటకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై శివకుమార్

**చీరాల:** సముద్రతీరానికి వస్తున్న పర్యాటకులు పోలీసు నిబంధనలు పాటించాలని ఈపూరుపాలెం ఎస్సై శివకుమార్ తెలిపారు. బుధవారం తొలిఏకాదశిని పురస్కరించుకుని సముద్రస్నానాలకు పర్యాటకులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా వాడరేవు, రామాపురం బీచ్‌లో పర్యాటకులకు ఎస్సై అవగాహన కల్పించారు. ఏడు ప్రాంతాలు సముద్రస్నానాలు ఆచరించేందుకు గుర్తించామని.. అక్కడ మాత్రమే స్నానాలు ఆచరించాలన్నారు. సముద్రంలో ఏర్పాటు చేసిన ఎర్రజెండాలను దాటి లోపలికి వెళ్ల వద్దని హెచ్చరించారు. అలల తాకిడి అధికంగా ఉండడంతో పర్యాటకులు గల్లంతవుతూ ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్ళను ఏర్పాటు చేశామని వెల్లడించారు.

### మైక్ సెట్ వితరణ


మైక్ సెట్ అందిస్తున్న దాతలు

**అద్దంకి:** కొత్తపేటలోని శ్రీ మహాలక్ష్మి తల్లి అమ్మవారి దేవస్థానానికి ఒక మైక్ సెట్, నాలుగు కుర్చీలను బుధవారం అందజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ, అద్దంకి ఆధ్వర్యంలో చుండూరి రామారావు వెంకట సుశీల చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు చుండూరి మురళీ సుధాకరరావు సౌజన్యంతో సమకూర్చారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కుల మత వర్గ బేధాలు లేకుండా సమాజంలోని అన్ని వర్గాలు సామరస్యంతో కలిసి మెలసి జీవించాలని, అప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, అధ్యక్షుడు ఎ. షేక్ మహమ్మద్ రఫీ, ఊటుకూరు రామకోటేశ్వరరావు, నర్రా శ్రీలక్ష్మి, సందిరెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ ఉబ్బా దేవపాలన, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, పసుపులేటి ఆంజనేయులు, పూర్ణ చంద్రరావు, కూకట్ల సుబ్బారావు, యరమోతు రమేష్ పాల్గొన్నారు.

### ఆగని దొంగతనాలు


ధ్వంసం చేసిన సోలార్ ప్లేట్లు


కొత్తూరులో రాగి తీగ చోరీ చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు

**బల్లికురవ:** వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి వైర్లు, సోలార్ ప్లేట్లు స్వీచ్ఛల చోరీలతో కొత్తూరు రైతులు అల్లాడిపోతున్నారు. పది రోజులుగా గ్రామానికి ఉత్తరం, దక్షిణం పడమర భాగాల్లోని పొలాల్లోని వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని రాగి వైరును చోరీ చేస్తున్నారు. సోలార్ ప్లేట్లను కూడా చోరీలు చేస్తుండటంతో రైతులు లబోదిబోమందులున్నారు. సమీప గ్రామాలకు చెందిన టీం పగలు రెక్కీ నిర్వహించి రాత్రికి చోరీకి పాల్పడుతున్నారని రైతులు శ్రీనివాసరావు, చెక్కెర శ్రీనవాసరెడ్డి, మేణావత్ హరియానాయక్, మేడావత్ కిషోర్ నాయక్, మెలికా ఆదినారాయణ వాపోయారు. ఇప్పటికే బోర్ల కింద కూరగాయలు పశుగ్రాసం సాగుచేశామని.. ప్రస్తుతం మోటార్లు పనిచేసే పరిస్థితి లేదని, రైతులు వివరించారు. అలాగే వెలమవారిపాలెంతో పాటు అద్దంకి మండలంలోని మైలవరంలో కూడా దొంగలు రెచ్చిపోతున్నారు. పోలీసులు తస్కరులను పట్టుకోవాలని వేడుకుంటున్నారు.

### భక్తిశ్రద్ధలతో సచ్చిదానంద జన్మదిన వేడుకలు


సామూహిక వ్రతాలు చేస్తున్న మహిళా భక్తులు

**అద్దంకి:** పట్టణంలోని నాగులబండ బజారులోలని శ్రీ ధన్వంతరీ దత్తపాదుకా క్షేత్రంలో బుధవారం శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ (అప్పాజీ) జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్షీరాభిషేకం, శ్రీ లక్ష్మీ గణపతి నవగ్రహ ఆయుష్య హోమం నిర్వహించారు. కేక్ కటింగ్, కాగడ హారతి ఉంజల్ సేవ, అనంతరం తీర్థప్రసాదాల వితరణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగసూరి హనుమత్ ప్రసాద్, కమటీ సభ్యులు పర్యేవేక్షించారు.

# భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి


విశేష అలంకరణలో పూనూరులోని వేణు గోపాల స్వామి


చీరాల: గరుడవాహనంపై ఊరేగుతున్న మదనగోపాల స్వామి


కొత్తపాలెంలో పూజలందుకుంటున్న సీతారామ స్వామి


అర్చకుల ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహిస్తున్న భక్తులు

**యద్దనపూడి:** శ్రీ మహావిష్ణువు శేషతల్పంపై యోగ నిద్రకు ఉపక్రమించే రోజు పురస్కరించుకొని తొలి ఏకాదశిని భక్తులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయాల్లో రుద్రాభిషేకాలు, వైష్ణవాలయాల్లో సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. పూనూరు వేణుగోపాలస్వామి, త్రిపురాంతక స్వామి, గన్నవరం కాశీ విశ్వేశ్వరస్వామి, యద్దనపూడి వెంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, రామలింగేశ్వరస్వామి, చింతపల్లిపాడు చెన్నకేశవస్వామి ఆలయాల్లో అర్చనలు నిర్వహించారు.

**కారంచేడు:** ఆషాఢ మాసం తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి మండల కేంద్రమైన కారంచేడు పెద్ద బజారు శివాలయం, కట్టమల్లేశ్వరస్వామి వారి ఆలయం, రామాలయం, వైష్ణవీదుర్గామాత ఆలయం, మాధవస్వామివారి ఆలయం, వెంకటేశ్వరస్వామి గుడి, సాయిమందిరంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు భక్తులకు తొలి ఏకాదశి పర్వదిన ప్రాముఖ్యతను తెలిపి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మండలంలోని స్వర్ణ, కుంకలమర్రు, ఆదిపూడి, దగ్గుబాడు దేవాలయాల్లోను భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**బల్లికురవ:** ఈ రోజు నుంచి మహా విష్ణువు యోగ నిద్రలోకి వెళతాడని, దానిని తొలి ఏకాదశి పర్వదినంగా జరుపుకుంటారని కొత్తపాలెం కొణిదెన, చెన్నుపల్లి, కొండాయపాలెం, రామాలయ అర్చకులు తెలిపారు. బుధవారం మండలంలోని విష్ణు ఆలయాలతో పాటు, శివాలయాల్లో అభిషేకాలు, విష్ణు సహస్ర నామ అర్చన, ప్రత్యేక అలంకరణ నిర్వహించారు.

**అద్దంకి:** స్థానిక కాకానిపాలెంలో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయంలో పూజలు నిర్వహించారు. ప్రసాదంగా గుగ్గిళ్ళు, పేల పిండి పంపిణీ చేశారు. దేవస్థాన అభివృద్ధి కమిటీ చైర్మన్ పొన్న పల్లి బ్రహ్మానందం, శాశ్వత ధర్మకర్త, అనంత వెంకట సుబ్బారావు, అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ చెన్ను పల్లి శ్రీనివాసచారి తదితరులు స్వామి ఆశీర్వచనాలు అందుకున్నారు.

**చీరాల అర్బన్:** తొలి ఏకాదశి పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పేరాలలోని శ్రీ మదనగోపాలస్వామి దేవాలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను జరిపించారు. ఈ రోజు స్వామివారిని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయని తెలిపారు. అలానే పట్టణంలోని వీరరాఘవస్వామి దేవాలయంలో వీరరాఘవస్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

**చీరాల రూరల్:** తొలి ఏకాదశి పండుగ సందర్భంగా బుధవారం చీరాలలోని ప్రసిద్ధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పేరాల ముత్యాలపేటలో వేంచేసియున్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారి చెట్టు వద్ద భక్తులు లక్ష మల్లెపూలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణపతి హోమం నిర్వహించారు. మహిళలు ఉదయాన్నే తలారా స్నానమాచరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు ఆచరించారు. అమ్మవారికి నైవేద్యాలు, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి చెట్టుకు పట్టు వస్త్రాలు కట్టి బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కూరగాయాల దండను తయారు చేసి అమ్మవారి చెట్టుకు అలంకరణ గావించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.


అద్దంకి: తీర్థ ప్రసాదాలను పంపిణీ చేస్తున్న సంఘ సభ్యులు


కారంచేడు పెద్ద బజారు శివాలయంలో భక్తుల ప్రత్యేక పూజలు


అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న రమేష్‌బాబు ఆయన సతీమణి లక్ష్మి

### అవకతవకలపై విచారణ జరిపించాలి


లారీ యూనియన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న బాల అంకమ్మరావు

**చీరాల:** స్థానిక చీరాల అసోసియేషన్‌లో అవకతవకలు జరిగాయని, దానిపై విచారణ జరిపించాలని ప్రశ్నించినందుకు తనపై దాడి చేసి తన కుటుంబాన్ని రోడ్డు పాలు చేశారని బుధవారం బాలఅంకమ్మరావు అనే లారీ యజమాని ఆందోళన వ్యక్తం చేశారు. చీరాల లారీ అసోసియేషన్ వద్ద తన కుటుంబంతో సహా నిరసన దీక్షకు దిగాడు. ఆయన మాట్లాడుతూ లారీ అసోసియేషన్‌లో అక్రమాలపై ఆడిట్ జరగాలని తాను ప్రశ్నించగా తన లారీకి బాడుగలు లేకుండా చేసి తన కుటుంబాన్ని రోడ్డున పడేశారన్నారు. పలుమార్లు తనపై దాడి చేశారని వాపోయాడు. పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఎస్సీ భూముల్లో అక్రమంగా నిర్మించిన యూనియన్ ఆఫీస్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు.

### శతాధిక వృద్ధుడు మృతి


గద్దల రాఘవులు, ఆదిపూడి

**ఆదిపూడి (కారంచేడు):** తన పనులు తాను చేసుకుంటూ ఆరోగ్యంగా ఉన్న శతాధిక వృద్ధుడు బుధవారం మృతి చెందాడు. మండలంలోని ఆదిపూడి గ్రామానికి చెందిన గద్దల రాఘవులు (103) అనే వ్యక్తి 1922లో జన్మించాడు. కారంచేడులో ఎంతో మంది రైతుల వద్ద నమ్మకంగా పనిచేశాడు. ఇప్పటికీ తన పని తాను చేసుకుంటూ జీవించే రాఘవులు ఒక్క సారిగా అనారోగ్యానికి గురైన మృతి చెందాడు. రాఘవులుకు ఇద్దరు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలున్నారు. సుమారు 70 మంది వరకు మనుమళ్ళు, మనుమరాళ్ళు, మునిమనుమళ్ళు, మునిమనుమరాళ్ళు ఉన్నారని బంధువులు తెలిపారు. అంత్యక్రియలు గ్రామంలో నిర్వహించారు.

# త్యాగానికి ప్రతీక మొహర్రం


వేటపాలెం: సుందరంగా అలంకరించిన పీర్లు


పేరాలలో నిప్పుల గుండం తొక్కుతున్న భక్తులు


బల్లికురవ: గ్రామోత్సవానికి సిద్ధంగా ఉంచిన పీర్లు

**కారంచేడు:** త్యాగానికి ప్రతీకగా ముస్లింలు మొహర్రం పండగను ఆచరిస్తారు. బుధవారం మండలంలోని ఆదిపూడి, కారంచేడు, దగ్గుబాడు, కొడవలివారిపాలెం, కుంకలమర్రులో వేడుకలు నిర్వహించారు. ఈ పండగను పీర్ల పండగగా కూడా పిలుస్తుంటారు. ఈ సందర్భంగా ఈద్గాల వద్ద పీర్లను ఊరేగించి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దగ్గుబాడులో పీర్లను నిప్పులు గుండం తొక్కుతూ తమ భక్తిని చాటుకున్నారు.

**వేటపాలెం:** మండలం పరిధిలోని పలు మసీదుల్లో ముస్లింలు మొహర్రం పురస్కరించుకొని బుధవారం నమాజ్‌లు చేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ పంగను ఈదుల్ అజహా ఈదుల్ జహా అని పిలుస్తారని తెలిపారు. ఇస్లాం మతంలోని ఐదు ప్రధాన సూత్రాల్లో ఒకటైన హజ్ తీర్థయాత్ర.. ఈ నెలలోనే జరుగుతుందన్నారు. అల్లా ఆదేశానుసారం ఇబ్రహీం తన ఏకైక కుమారుడిని ఇస్మాయిల్‌ను బలి ఇవ్వడానికి సిద్ధమైన రోజని తెలిపారు.

**బల్లికురవ:** అల్లా అనుగ్రహం అందరిపై ఉండాలని కొప్పెరపాడు పెద ముజావర్లు షేక్ సుభాని, మీరావలి, ఆదం సాహెబ్ తెలిపారు. కొప్పెరపాడు, చెన్నుపల్లి, కోటావారిపాలెం, అంబడిపూడి, ముక్తేశ్వరం, కొణిదెన గ్రామాల్లో పీర్లచావిళ్లతో పాటు, పీర్లను ప్రత్యేకంగా అలకంరించారు. అలాగే పెద్ద సరగత్‌తో గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రికి పీర్లను గుండాలకు వద్దకు తరలించారు. ఐక్యతతో జీవించాలని ముజావర్లు పిలుపునిచ్చారు.


పర్చూరులో పేద ప్రజలకు అన్నదానం చేస్తున్న ముస్లింలు

**చీరాల:** మండలంలోని జాండ్రపేట గ్రామంలోని శ్రీ దాదా అమీన్ పీర్ దర్గా వద్ద పదిరోజులు నుంచి మొహర్రం ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. అలానే పేరాలలోని పీర్ల చావిడి వద్ద మొహర్రం సందర్భంగా భక్తులు నిప్పులు గుండం తొక్కారు. కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ మంచి చెడుల మధ్య జరిగిన పోరాటంలో చెడును అంతం చేసిన వీరుల త్యాగ ఫలితంగా మొహర్రం జరుపుకుంటామన్నారు.

**పర్చూరు (కారంచేడు):** మొహర్రం పండగ పురస్కరించుకొని మండల కేంద్రమైన పర్చూరు అతహర్ మజీద్ కమిటీ సభ్యులు స్థానిక నేతాజీ వృద్ధాశ్రమంలోని వృద్ధులతో పాటు, సమీప పాదచారులకు బుధవారం అన్నదానం నిర్వహించారు. త్యాగానికి ప్రతీకగా ఉన్న మొహర్రం పండగ రోజున పేద ప్రజలకు అన్నదానం చేస్తే అల్లా తమకు మంచి చేస్తాడని ముస్లింల విశ్వాసం. మజీద్ కమిటీ సభ్యులు షేక్ అహ్మద్‌బాషా, షేక్ ఇమాం, అష్రఫుల్‌హక్, మౌజన్‌బాజీ, ఫజల్, ఫక్రుద్దీన్, అలీ, అహ్మద్, బాషా, బాబుల్లా పాల్గొన్నారు.


వేటపాలెం: నిప్పులు గుండంలో నడుస్తున్న భక్తులు

### వీధి కుక్కల తరలింపు ప్రారంభం



సాక్షిలో ప్రచురించిన కథనం

సాక్షి ఎఫెక్ట్..

**వేటపాలెం:** మండల కేంద్రం వేటపాలెంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని. దీనిపై భౌ అంటేనే భయం.. అనే శీర్షిక సాక్షిలో ఈ నెల 15వ తేదీ ప్రచురించారు. గ్రామంలోని పశుపోషకుల పశువుల పాకలపై ఉన్న లేగ దూడలపై రాత్రి వేళల్లో కుక్కల మందలు దాడులకు తెగపడుతున్నాయనే వార్తపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన మండల, గ్రామ స్థాయి అధికారులు కుక్కల తరలింపును బుధవారం నుంచి ప్రారంభించారు. వీధి కుక్కల పట్టించి గ్రామానికి దూరంగా అటవీ ప్రాంతాలకు తరలిస్తున్నారు.


వీధి కుక్కలను పట్టుకుంటున్న పంచాయతీ కార్మికులు





# కారంచేడు మృతవీరులకు నివాళి


రుధిరక్షేత్రం వద్ద నివాళులర్పిస్తున్న దళిత, ప్రజా సంఘాల నేతలు, గ్రామ పెద్దలు

- నేటితో 39 సంవత్సరాలు పూర్తి
- విజయనగర్ కాలనీలో ర్యాలీ

**చీరాల రూరల్:** ఐకమత్యంతో పెత్తందార్ల దాడులను ఎదుర్కోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. కారంచేడు మృతవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండల పరిధిలోని విజయనగర్ కాలనీ గ్రామంలోని రుధిర క్షేత్రం వద్ద సంస్మరణ సభను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు. పలువురు దళిత, ప్రజా సంఘాల నాయకులు కారంచేడు మృతవీరులకు నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ దళితులంతా పెత్తందార్ల దాడులను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కారంచేడు, చుండూరు వంటి సంఘటనలు దళితులలో ఐకమత్యత లోపించడం వల్లనే చోటుచేసుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కారంచేడు సంఘటనలో దళితులు, ఇతర ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున చేసిన ఐక్య ఉద్యమాల ఫలితంగానే నేడు విజయనగర్ కాలనీగా ఏర్పడిందని చెప్పారు. అయితే అనేక ఏళ్ల గడిచినప్పటికీ పట్టు వదలకుండా ఆనాటి నిందితులకు సుప్రీం కోర్టులో శిక్షలు వేయించారని.. అయితే పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కారంచేడు ఉద్యమం దేశ చరిత్రలో ఎప్పటికి చిరస్థాయిగా నిలిచి ఉంటుందని చెప్పారు. ఇటువంటి అరాచక సంఘటనలు దేశంలో మరెక్కడా జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఉద్యమ సమయంలో దళితులలో చైతన్యం రగిలించడంలో పాడిన ఆనాటి పాటలను ఈ సందర్భంగా పలువురు కళాకారులు ఆలపించారు. దుడ్డు భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సభలో తేళ్ల వెంకటస్వామి, దుడ్డు సుందరరావు, నూకతోటి బాబురావు, కృపాకర్ మాదిగ, పిల్లి మాణిక్యరావు, తేళ్ల సుబ్బారావు, బుడంగుంట్ల లక్ష్మీ నరసయ్య, గొర్రెపాటి రవి, వంగిపురపు రమేష్, గ్రామ పెద్దలు తేళ్ల లక్ష్మీప్రసాద్, తేళ్ల దేవదానం, తేళ్ల ప్రసాద్, కంచర్ల చిట్టిబాబు, గోసాల సుధాకర్, దుడ్డు ఏసుపాదం, బొంత అంకయ్య, తేళ్ల సైమన్, కాటి మార్క్, సీహెచ్ గంగయ్య, ఎన్. బాబురావు, ఎం. వసంతరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నేతలు, హాజరైన గ్రామ పెద్దలు

### ఘనంగా ఏకలవ్య జయంతి


ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

**చీరాల:** ఆంధ్రప్రదేశ్ ఎరుకుల సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏకలవ్య జయంతి వేడుకలు రామానగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఏకలవ్య మహారాజ్ చిత్రపటానికి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనులకు ఏకలవ్య చేసిన గొప్పతనాన్ని, త్యాగాన్ని కొనియాడారు. గురుభక్తి కలిగిన వ్యక్తిగా చరిత్రలో నిలిచారన్నారు. ఏపీవైఎస్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మా శ్రీనివాసరావు, భోగి శ్రీకాంత్ మిత్ర, ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌కుమార్ ధర్మా, దళిత నాయకులు చారువాక, దాసరి శ్రీకాంత్, రామేశ్వరం కుమార్, దేవర వాసు, భువనగిరి ఎలీషా, సేలం డేవిడ్, కఠారి మురళి, కె.శివప్రసాద్, మొగిలి ప్రతాప్, కె.బాటసారి, ప్రవీణ్, వాసు, బచ్చు భరత్, అంగడి స్వాతి, రాగాల రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

**చీరాల రూరల్:** స్థానిక ఆర్టీసీ గ్యారేజ్ వద్దగల రామనగర్‌లో ఎరుకల సేవా సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతిని జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మ శ్రీనినవాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా నాయకులు ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతిపై వచ్చిన ఆరోపణలను, అసత్య ప్రచారాలను నాయకులు తీవ్రంగా ఖండించారు. నాయకులు దాసరి శ్రీకాంత్, నల్లబోతుల మోహన్ కుమార్ ధర్మ, బోగిరి ఎలిషా, దేవర వాసు, కటారి మురళి బాబు, అంగడి కిషోర్, సేలం డేవిడ్, రామేశ్వర కుమార్, నల్లబోతుల వాసు, మొగిలి ప్రతాప్, కర్రెద్దుల శివప్రసాద్, ఆంబోతుల ప్రవీణ్, బచ్చు శరత్, భరత్, రాజేష్‌లు పాల్గొన్నారు.